క్లుప్తంగా

నేడు మహా శివరాత్రి ధ్యాన సంగీత మహోత్సవం

అబిడ్స్: ఈనెల 18న మహా శివరాత్రిని పురస్కరించుకుని ట్యాంక్‌బండ్ గోశాల ఆడిటోరియంలో మహా శివరాత్రి ధ్యాన సంగీత మహోత్సవం నిర్వహిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. గుడాకేశ గ్రాండ్ మాస్టర్ ప్రబోద్ అచ్యుతచే ధ్యానం, సంగీత రత్న పిప్పళ్ల ప్రసాద్‌చే 14 సంగీత వాయిద్యాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 9 గంటలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 6 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ట్యాంక్‌బండ్ గోశాలపై ఉన్న ఆడిటోరియంలో రాత్రంతా ఈ వినూత్న తరహా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అందరినీ బ్రహ్మజ్ఞానులుగా తరింపజేసేందుకు కృషి చేస్తామన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణోత్సవం



చార్మినార్: మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని శనివారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నామని మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. భక్తులు సకాలంలో ఆలయం వద్దకు చేరుకుని శివుడి దర్శనం చేసుకుని శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించాలని ఆయన కోరారు.

రాములుకు సత్కారం



రాములును సత్కరిస్తున్న గౌరి సతీష్ తదితరులు

అబిడ్స్: ఓయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములును రాష్ట్ర ప్రైవేటు కళాశాలల సంఘం అధ్యక్షులు గౌరీ సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ.. ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్‌గా రాములును నియమించడం ఎంతో అభినందనీయమన్నారు. ఓయూ వీసీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైమద్, చాంద్ పాషా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుద్వారలో ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న రాథోడ్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆల పురుషోత్తమ్‌రావు

అబిడ్స్: గురుద్వారలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రార్థనలు చేశారు. సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, ఆల పురుషోత్తమ్‌రావు, ప్రియాగుప్తా, నందకుమార్, పి.నరేందర్ యాదవ్ ప్రార్థనలు నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు తదితరులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు, ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దుగ్యాగల రాంప్రసాద్‌తో కలసి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే రోడ్డుపై వాహనాలు నడిపే విధానం, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి చట్టపరమైన కఠిన శిక్షలు అమలు చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సులను రద్దుచేసే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరి దేవి, వైస్ ప్రిన్సిపాల్ సీవీవీ ప్రసాద్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మయ్యలతో పాటు ట్రాఫిక్ పోలీసులు విజయరామరాజు, ఎస్ఐ.జ్యోతి, ఎన్.వెంకటప్రసాద్, చక్రధర్ పాల్గొన్నారు.

పాతబస్తీలో పండ్ల మార్కెట్లు కిటకిట



చార్మినార్ వద్ద సిద్ధంగా ఉన్న వివిధ రకాల పండ్లు

చార్మినార్: మహా శివరాత్రిని పురస్కరించుకొని పాతబస్తీలోని చార్మినార్ ప్రధాన రోడ్డులోని పళ్ల మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. కావాల్సిన పండ్లను ఖరీదు చేయడానికి రెండు రోజుల ముందు నుంచే భక్తులు ఉత్సాహం చూపుతుండడంతో పండ్ల మార్కెట్‌లు వినియోగదారులతో రద్దీగా మారాయి. దీంతో పాతబస్తీలో ఎక్కడ చూసినా పండగ సందడి కనిపిస్తోంది. పురానాపూల్, లాల్‌దర్వాజ మోడ్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, కిషన్‌బాగ్, చార్మినార్, మక్కా మసీదు తదితర ప్రాంతాలన్నీ జనం రద్దీతో కళకళలాడుతున్నాయి.

జాబ్ మేళాకు విశేష స్పందన



గోల్కొండ: నిరుద్యోగుల కోసం తాము జాబ్ మేళాలు నిర్వహిస్తూ యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తున్నామని గోల్కొండ బ్రెయిన్ బ్లేజర్ కమ్యూనిటీ ల్యాబ్ ఇన్‌చార్జి కాటన్ రాజేష్ అన్నారు. శుక్రవారం గోల్కొండ బంజార దర్వాజ వద్ద గల అంబేడ్కర్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో ప్రతిభ చూపిన వారికి కంపెనీ ప్రతినిధులు ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ అనురాధ దేవి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలే ప్రజలకు అందుతున్నాయి'



సమావేశంలో కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ తదితరులు

జియాగూడ: కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ పొందుతూ తిరిగి కేంద్రాన్ని విమర్శిస్తున్నారని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం జియాగూడ దుర్గానగర్‌లో బూత్ అధ్యక్షుడు భాస్కర్ అధ్యక్షతన శక్తికేంద్ర ఇన్‌చార్జ్ కమలబాయ్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు అయ్యింది. ముఖ్యఅతిథిగా హాజరైన అమర్‌సింగ్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ ఎంతో పటిష్టతతో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోవర్ధన్, జియాగూడ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు శివకుమార్‌యాదవ్, రాజేందర్, రాజ్‌పోల్, యాదగిరి, జగదీష్ యాదవ్ పాల్గొన్నారు.

సేవక్‌నగర్‌లో 'హాత్ సే హాత్ జోడో'



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని సేవక్‌నగర్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి, బీఆర్‌ఎస్, బీజేపీల అక్రమాలు, అన్యాయాలు వివరించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రతో తిరిగి అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్, శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీ కిరణ్ ప్రభాకర్

జియాగూడ: ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించాలని సౌత్ వెస్ట్ డీసీ కారె కిరణ్ ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రైడ్ ఫంక్షన్ హాల్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవ్ ఆర్గనైజర్, పీస్ కమిటీ సభ్యులతో కులంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటయ్యింది. ఈ సందర్భంగా డీసీపీ కిరణ్ ప్రభాకర్ మాట్లాడుతూ.. శివరాత్రి, శివాజీ జయంతి, షబ్బె భరత్ వేడుకలను సామరస్యంతో నిర్వహించుకోవాలన్నారు. గోషామహల్ ఏసీపీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ఊరేగింపులో యువకులు ఎలాంటి ఉద్రేకాలకు గురికాకుండా శోభాయాత్రను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ అధ్యక్షుడు శంకర్, సేవాదళ్ ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి, వివేక్‌సింగ్ ఠాకూర్, పీస్ కమిటీ సభ్యులు మోజం, హమీద్, కావూరి వెంకటేష్, నర్మద, కె.న్సింగ్‌రావు, శివాజీ పాల్గొన్నారు.

జీఓ 27ను వెంటనే రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చొక్కారావు తదితరులు

సుల్తాన్‌బజార్: అంధులకు ఇబ్బందికరంగా ఉన్న జీఓ 27ను వెంటనే రద్దు చేయాలని డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ (డీడబ్ల్యూఏబీ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలిండియా కాన్ఫిడరేషన్ ఆఫ్ బ్లైండ్ (ఏఐసీబీ) కార్యదర్శి పానుగోటి చొక్కారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం చొక్కారావు మాట్లాడుతూ.. మొత్తం 3 భాషల్లో అంటే స్థానిక భాష, ఇంగ్లిష్, హిందీలో చదువుకోవడానికి అనుమతించడం ద్వారా దేశంలో ఏ రాష్ట్రంలోనైనా పని చేయగలిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీడబ్ల్యూఏబీ ఉపాధ్యక్షుడు రంగారావు, కోశాధికారి పరమేష్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ అంజయ్య, కార్యనిర్వాహక సభ్యుడు అజిత్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి రాజ్యం: అమర్ సింగ్



సమావేశంలో బీజేపీ నాయకుడు అమర్ సింగ్ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ వద్ద కార్వాన్ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందని, సీఎం కేసీఆర్ కనుసన్నలలో అవినీతి కొనసాగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సునీల్‌యాదవ్, ముల్లె భిక్షపతి, హైదరాబాద్ బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డిజ్వర్ సింగ్ పాల్గొన్నారు.

సాహితీ పురస్కారాల ఎంపికకు సూచనలు ఇవ్వండి

నాంపల్లి: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ రచనల్ని ప్రోత్సహించడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. 2021వ సంవత్సరానికి చేసే పురస్కారాల ఎంపికకు పాఠకులు, రచయితల నుంచి విశ్వవిద్యాలయం సూచనలు కోరుతోంది. వివిధ ప్రక్రియల్లో 2018 జనవరి నుంచి 2020 డిసెంబరు మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన గ్రంథాల్లో పాఠకులు ఉత్తమంగా భావించిన గ్రంథాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. రచయిత మరణించినప్పటికీ వారి రచనలు 2018 జనవరి నుంచి 2020 డిసెంబరు మధ్య కాలంలో ప్రచురణ పొంది ఉంటే సూచించవచ్చు. వచన కవిత, పద్య కవిత, బాల సాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 10 ప్రక్రియల్లో అన్ని ప్రక్రియలకు గాని, కొన్నింటికి గాని తమకు నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చు. సూచనలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామ, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ కర్త పేరు పేర్కొనాల్సి ఉంటుంది. రచయితలు కూడా తమ గ్రంథాలను స్వయంగా సూచించవచ్చు. అనువాద సాహిత్య విభాగానికి తప్ప మిగతా విభాగాలకి అవార్డుల కోసం అనువాదాలు అనుసరణలు ఆమోదించబడవు. వచన రచన అనే ప్రక్రియలో సామాజిక, ఆర్థిక, తాత్త్విక, వైజ్ఞానిక, స్వీయ చరిత్ర, దేశ చరిత్ర, సంస్కృతి, కళలకు సంబంధించిన గ్రంథాలు సూచించవచ్చు. అన్ని ప్రక్రియల్లోనూ ప్రామాణికమైన మౌలిక గ్రంథాలనే సూచించాలి. కవితా సంపుటులైతే కనీసం 60 పేజీలు, మిగతా ప్రక్రియల్లో గ్రంథాలు 96 పేజీలకు తగ్గరాదు బాల సాహిత్యం, నాటకం ప్రక్రియల్లో పుటల పరిమితి ఉండదు. పాఠకులు/రచయితలు తమ దరఖాస్తులను రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్-500004 అనే చిరునామాకు 20 మార్చి 2023వ తేదీలోగా పంపాల్సి ఉంటుందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, కార్వాన్ నియోజకవర్గంలో వీటివల్ల వందలాది పేద కుటుంబాల వారు లబ్ధిపొందారన్నారు. మైనార్టీలు, దళితులు, బీసీలు, ఆర్థికంగా వెనుకబడ్డ వారి కోసం కూడా ఎన్నో పథకాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలను టార్గెట్ చేస్తున్నారు: ఒవైసీ

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా ముస్లింలను వ్యవస్థీకృత పద్ధతిలో టార్గెట్ చేస్తున్నారని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. హర్యానాలోని భివానీ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అవి గో రక్షక్ ముఠా అమానవీయ హత్యలుగా అభివర్ణించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడతారా అని ప్రశ్నించారు. గో రక్షకుల ముసుగులో ప్రజలను చంపి దోపిడీకి పాల్పడుతున్న సంఘం విద్రోహక శక్తులను బీజేపీ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ల మద్దతుతో గో రక్షక్ దాడులని దుయ్యబట్టారు.

సేవాలాల్ చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి



మాట్లాడుతున్న రాజు నాయక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆ రోజును సెలవుదినంగా ప్రకటించాలని కేంద్ర మాజీ మంత్రి రవీందర్‌నాయక్ కోరారు. శుక్రవారం రవీంద్రభారతిలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారాహిల్స్‌లో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ మహరాజ్ చరిత్రను పాఠ్యాంశంలో చేర్చడంతో పాటు ఆయనపై పోస్టల్ స్టాంప్ విడుదల చేసేలా బంజారా సోదరులు కృషి చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ ప్రకాష్ రాథోడ్, విశ్రాంత ఐపీఎస్ అధికారి జగన్నాథ్, బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. పలు ప్రాంతాల్లో అన్నదానాలు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. – అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



గోషామహల్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో.. నందకిశోర్ వ్యాస్ బిలాల్



గన్‌ఫౌండ్రీలో.. మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా సంతోష్‌గుప్తా



వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ బాల్‌రాజ్‌యాదవ్, ఆశీష్‌కుమార్‌యాదవ్



వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఠాకూర్ జీవన్‌సింగ్, మిత్రకృష్ణ, కావూరి వెంకటేష్



సంబరాలు నిర్వహిస్తున్న దీపాంకర్‌పాల్ తదితరులు



కేక్ కట్ చేస్తున్న రాధాకృష్ణ, సత్యనారాయణ తదితరులు




పూజలు నిర్వహిస్తున్న పెండ్యాల లక్ష్మణ్‌రావు, గోపీగౌడ్, శ్రీకాంత్ తదితరులు



కార్వాన్‌లో చిన్నారులతో బీఆర్‌ఎస్ నాయకుడు జీవన్‌సింగ్, భాస్కర్ తదితరులు

గోల్కొండ సదర్ ఖాజీ మృతి



యూసుఫ్ ఉద్దీన్ హుస్సేన్

గోల్కొండ: గోల్కొండలో గల ప్రధాన ఖాజీ కార్యాలయ ప్రధాన ఖాజీ యూసుఫ్ ఉద్దీన్ హుస్సేన్ ఎలియాస్ అస్కర్ పాషా (75) శుక్రవారం మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నాడు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం లంగర్‌హౌస్‌లోని మీరా హుస్సేన్ బగ్దాది ముస్లిం శ్మశాన వాటికలో జరిగాయి.

వీధి కుక్కల సమస్యకు పరిష్కారం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వట్టినాగులపల్లి గ్రామంలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె కమిషనర్ ఎ.సత్యబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉండటంతో వాటి సంఖ్యను తగ్గించటం, వాటితో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను దూరం చేయాలనే ఉద్దేశంతో బ్లూ క్రాస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామన్నారు. వారు వార్డుల వారీగా వీధి కుక్కలను పట్టుకుని వ్యాక్సినేషన్ ఇచ్చి వదలిపెడతారన్నారు. కౌన్సిలర్ బి.యాదమ్మ, డీఈ నరసింహారాజు, బ్లూక్రాస్ ప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి సోమనాథ ఆలయం ముస్తాబు





ముస్తాబైన సోమనాథ ఆలయం

యాకుత్‌పురా: మహా శివరాత్రికి యాకుత్‌పురా రంగేలి కిడికిలోని సోమనాథ ఆలయం ముస్తాబయ్యింది. మహా శివరాత్రి నేపథ్యంలో వివిధ రంగులతో ఆలయాన్ని అందంగా సిద్ధం చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు టీఎస్. నరేష్ కుమార్ తెలిపారు. ఆలయంలో కొలువుదీరిన ప్రత్యేకమైన భారీ శివలింగాన్ని దర్శించుకునేందుకు పాతబస్తీతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారాన్ని ఆయన పేర్కొన్నారు. ఉదయం 5 గంటలకు ప్రత్యేక రుద్రభిషేకం, అలంకరణతో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ ఆలయంలో శివలింగంతో పాటు అన్నపూర్ణాదేవి, ఆంజనేయస్వామి కొలువై ఉన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బస్తీల సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: బస్తీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. డివిజన్ పరిధిలోని రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ అలీ మసీదు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీల అభివృద్ధికి పాదయాత్రలు చేస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు ప్రాంతాల్లో గుంతలమయంగా మారిన రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరుల పాల్గొన్నారు.